తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు సత్కారం



శంషాబాద్ : రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ సోమవారం ఆయన అధికార నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. కాంగ్రెస్ నేతలు ప్రసాద్, అంకిత్, మణికులకర్ణి తదితరులున్నారు.

మహిళలకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



కౌన్సిలర్ యాదమ్మకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

మణికొండ: మహిళలకు అనుకూలంగా ఉండేలా అదనపు బస్సు సర్వీసులను పెంచాలని వట్టినాగులపల్లి డ్వాక్రా సంఘాల మహిళలు కౌన్సిలర్ యాదమ్మకు వినతిపత్రం అందజేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి కౌన్సిలర్‌ను కలిసి వారు గ్రామానికి కేవలం పాఠశాల విద్యార్థులకు ఉదయం సమయంలోనే బస్సులు నడుస్తున్నాయని వివరించారు. సాయంత్రం వరకు బస్సులు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మరిన్ని బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ మాట్లాడుతూ.. గ్రామ మహిళల డిమాండ్‌ను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అదనపు బస్సులను నడపాలని చెబుతామన్నారు.

ప్రైవేట్ ప్లే ఎక్విప్‌మెంట్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోగల గంధంగూడ, రంగారెడ్డినగర్ కాలనీలలో ప్రైవేట్ ప్లే ఎక్విప్‌మెంట్‌ను సోమవారం ప్రారంభించారు. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి మాట్లాడుతూ.. యువకులు, విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా ఈ ప్లే గ్రౌండ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి అందరికీ కావాల్సిన సౌకర్యాలను కల్పించామన్నారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బొర్ర రాందాస్, కార్పొరేటర్లు చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్, భూపాల్‌గౌడ్, అస్లాంబిన్ అబ్దుల్లా, సాగర్‌గౌడ్, సీనియర్ నాయకులు నాగరాజు, సయ్యద్ ఖాజా, ప్రేమ్‌గౌడ్, చేగూరి రాజు, గంగని రవి తదితరులు పాల్గొన్నారు.

బాంబిన్స్‌లో చిత్రలేఖన పోటీలు



అత్తాపూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు గాను అత్తాపూర్‌లోని బాంబిన్స్ ది స్కూల్‌లో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పలు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభకనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాకతీయ సేవా సమితి కేలండర్ ఆవిష్కరణ



కేలెండర్‌ను ఆవిష్కరించిన నాయకులు

మణికొండ: మణికొండ కాకతీయ సేవా సమితి నూతన సంవత్సరం కేలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. మణికొండలో జరిగిన కార్యక్రమంలో కమ్మ సంఘం అధ్యక్షుడు బ్రహ్మాజీ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పేద కమ్మ యువతుల వివాహాలు, పేదరికంతో చదువుకోలేని విద్యార్థులు, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు హైమాంజలి అనిల్‌కుమార్, కమ్మ నాగలక్ష్మి నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, కొత్తపల్లి శ్రీనివాస్‌రావు, ఎం. జగదీష్, పి.మాల్యాద్రి నాయుడు, వీరభద్రరావు, శివశంకర్, జి.శ్రీనివాస్ చౌదరి, జె.సతీష్‌కుమార్, అచ్యుత రామయ్య, చావ వినయ్‌కుమార్, బి.ధనుంజయరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించండి



మాట్లాడుతున్న డీసీ రవి కుమార్

అత్తాపూర్: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రవి కుమార్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ ఎస్‌డబ్ల్యూఎం, ఎస్ఎస్, ఎస్ఎఫ్ఏ, ఈఎస్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి కమిషనర్ మాట్లాడుతూ... నజరీ నక్షా సర్వే ప్రకారం 100 శాతం పిన్‌పాయింట్ ప్రోగ్రామ్‌ను అమలు చేయాలన్నారు. రాత్రి సమయాల్లో జీవీపీల క్లియరెన్స్, సత్వర హాజరు, దీర్ఘకాలికంగా హాజరు కాని వారి జాబితాను అందించాలన్నారు. యుద్ధ ప్రతిపాదికన ఎప్పటికప్పుడు చెత్త చెదారాన్ని తొలగించాలని సూచించారు.

విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని పరిపాలనా భవనం ముందు విద్యార్థి సంఘం 2023–24 ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. హెచ్‌సీయూలో ఇటీవల మృతి చెందిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, నష్టపరిహారం చెల్లించాలని, వారి మృతిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అతీక్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి మోహిత్ మాట్లాడుతూ ఉద్యోగులకు భద్రత కల్పించాలని, మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలన్నారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన



మణికొండలో ఆందోళన చేసిన ఆటోడ్రైవర్లు



వినతిపత్రం అందజేస్తున్న చింతల నందకిశోర్ గుప్తా

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై..
- ఉపాధి చూపాలని డిమాండ్

మణికొండ: మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించటంతో తమకు ఆదాయం తగ్గిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమకూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి చూపాలని ఆటో డ్రైవర్లు ఆందోళనకు దిగారు. మణికొండ మున్సిపాలిటీ, మర్రిచెట్టు సర్కిల్‌లో సోమవారం ఉదయం వారు ఆర్టీసీ బస్సులకు అడ్డుగా తమ ఆటోలను నిలిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు అంజి,రమేష్, రవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన మహిళలకు ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితం పథకంతో వారు తమ ఆటోలలో ప్రయాణించటం లేదన్నారు. దాంతో తమ ఆదాయం సగానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఉచిత పథకాలతో అనేక రంగాల్లో కొందరికి ఇబ్బంది కలిగినప్పుడు వారిని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఆర్టీసీ బస్సులు ఆగిపోయిన విషయం తెలుసుకుని రాయదుర్గం పోలీసులు ఆటో డ్రైవర్లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ఆటోడ్రైవర్లు సైదులు, రాజు, రాఘవులు, నరసింహ, కల్యాణ్, వెంకట్ తదితరులున్నారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్: ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ రంగారెడ్డి కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఆరాంఘర్ చౌరస్తాలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ, నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నిరంజన్, మహ్మద్‌పాషా, చోటు, నరేందర్‌రెడ్డి, నరసింహ, జగన్, మల్లేష్, రామకృష్ణ, కృష్ణారెడ్డి, ఆనంద్, శ్రీహరి, రవీందర్‌రెడ్డి, శ్రీను, రాజు, ఆటోడ్రైవర్లు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం

శంషాబాద్ : ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో రోడ్డున పడిన ఆటోడ్రైవర్ల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని భారతీయ మజ్దూర్ సంఘ్ ఆటో, ట్యాక్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా హెచ్చరించారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చిన ఆటోడ్రైవర్లు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నందకిశోర్ గుప్తా మాట్లాడుతూ.. 'బతుకులు బాగుచేస్తారని కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసిన ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం నిండా ముంచుతోందని' ఆరోపణలు చేశారు. ఆటోవాలాల డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ సయ్యద్, కుమ్మరి రవి, సలీం, నర్సింహ్మగౌడ్, జగదీష్, శివ, శ్రీనివాస్, ఫిరోజ్, ఫయాజ్, రంజిత్, లడ్డు, కృష్ణ, శ్రీను, దర్శన్, శ్రీశైలం, రమేష్, మహేష్, వెంకట్‌రెడ్డి, రాములు, ప్రభాకర్ సాయి, సాబిర్, వెంకటేష్ తదితరులున్నారు.

రూ. 32.13 లక్షలతో అభివృద్ధి పనులు



డ్రైనేజీలైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: ప్రజల ఆరోగ్యం కోసం డ్రైనేజీ వ్యవస్థను గాడిలో పెట్టే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లి గ్రామం శాంతినగర్‌లో సోమవారం రూ.32.13 లక్షలతో డ్రైనేజీలైన్ పనులను కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎక్కడైతే మురుగు సమస్య ఉందో అక్కడ తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లి మురుగు రోడ్లపై వెళ్లకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేష్, సీనియర్ నాయకులు సామ ఇంద్రపాల్‌రెడ్డి, అనుముల జాన్‌పాల్, సీహెచ్.శ్రీవర్ధన్‌రెడ్డి, రగడంపల్లి శ్రావణ్‌కుమార్, కోరని రవీందర్, దేవదాస్, పట్నం నరేష్, జబీన్ హుస్సేన్, మోహన్‌రెడ్డి, పెంజర్ల మోహన్, గిరిబాబు, అరింట్ల విశాల్, వడ్డకొండ సురేష్, మహేశ్, ఆదిరాల అరుణ్‌బాబు, చిన్న, సంతోష్, వెంకటేష్, రాజు, దుర్గస్వామిదాస్, లింగాల రాకేష్, మనోహర్, ప్రమీల, ఇందిర, జయమ్మ పాల్గొన్నారు.

'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'తో ఉపయోగం

ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ సాయిరామకృష్ణ

మణికొండ: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనేది మన జీవన నాణ్యతను మెరుగుపరచటానికి, సమాచారాన్ని సేకరించి ప్రాసెస్ చేసి అందించే బిలియన్ల కొద్ది పరికరాల నెట్‌వర్క్ వేగంగా అభివృద్ధి చెందుతుందని, దీంతో సమాజానికి ఎంతో ఉపయోగమని ఐఐటీ హైదరాబాద్ మెటీరియల్స్ సైన్స్, మెటలర్జికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ సాయిరామకృష్ణ అన్నారు. సీబీఐటీలో సోమవారం నుంచి ఈనెల 23 వరకు కొనసాగే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటర్నెట్ రంగంతో పారిశ్రామిక యంత్రాలు, వైద్య పరికరాలను సైతం అనుసంధానం చేస్తున్నారన్నారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ.. 5.0 కోణంలో ఐఓటీ, సెన్సార్ల ప్రాముఖ్యతను వివరించారు. మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్ఓడీ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీపీ కో– ఆర్డినేటర్లు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సోలమన్‌రాజ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు



సదస్సులో మాట్లాడుతున్న వీసీ బీజే రావు

రాయదుర్గం: పర్యావరణ పరిరక్షణకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని బిపి రాధాకృష్ణన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్ (సీఈఓఏఎస్), స్కూల్ ఆఫ్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పు, క్లీన్ ఎనర్జీ' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులకు మానవ తప్పిదాలే కారణమన్నారు. వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణలో విధాన మార్పులను తీసుకురావడంలో కూడా అందరూ సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఆర్ఈడీసీఓ) ఇంధనశాఖ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జానయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత, ప్రత్యామ్నాయ ఇంధన వ్యవస్థలు, నికర సున్నా కర్బన ఉద్గారాల గురించి పౌరులకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ డీన్ ప్రొఫెసర్ కేసీ జేమ్స్‌రాజు, సీఈఓఏఎస్ హెడ్ ప్రొఫెసర్ ఎం జయానంద్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జి కిషోర్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గ్రంధి కిషోర్‌కుమార్ ప్రసంగించారు.

నాలా ఆక్రమణపై చర్యలు

ఆక్రమణ దారునిపై క్రిమినల్ కేసు

మణికొండ: అనాదిగా ఉన్న బుల్కాపూర్ నాలాను పూడ్చి ఆక్రమణకు పాల్పడటంతో పాటు పక్కనే ఉన్న శ్మశానాలను తొలగించే ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకున్నారు. ఆక్రమణదారుడిపై ఏకంగా క్రిమినల్ కేసు నమోదు చేయాలని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని మర్రిచెట్టు సమీపంలో ఉన్న బుల్కాపూర్ నాలాలో ఆదివారం మట్టిని నింపి దాన్ని ఆక్రమణకు కొందరు అక్రమార్కులు పాల్పడ్డారు. ఈ విషయాన్ని గమనించి స్థానికులు అడ్డుకుని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విషయాన్ని 'నాలాలను వదలని అక్రమార్కులు' శీర్షికన 'సాక్షి' దినపత్రిక సోమవారం కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన గండిపేట మండల తహసీల్దార్ గోవర్ధన్ నాలా ఆక్రమణలను తొలగించడంతో పాటు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రోజంతా నాలాలో పోసిన మట్టిని జేసీబీలు, ట్రాక్టర్లతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడ ఆక్రమణలు జరిగినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాలా పక్కనే ఉన్న తమ వంశీయుల శ్మశానాలను తొలగింపజేసే యత్నం చేయడంతో ఆ విషయంపై మాజీ ఎంపీటీసీ ఎం.రాఘవరెడ్డి సైతం రాయదుర్గం పోలీసులకు మరో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా మర్రిచెట్టు నుంచి లక్ష్మీనగర్ కాలనీవైపు వచ్చిన నాలా ఆక్రమణలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్



నాలాలో పోసిన మట్టిని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యం



కాలనీవాసులతో మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ ఆదర్శనగర్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో చెత్త సేకరణ ఆటోలు, ఓపెన్ పాయింట్లు, తాగునీటి సమస్య, విద్యుత్ తదితర వాటిని తెలుసుకునేందుకు సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ప్రజలు చెత్త చెదారాలు రోడ్లపై వేయకుండా అవగాహన కల్పించారు. చెత్త సేకరణలో ఆటో రిక్షా కార్మికులు నిర్లక్ష్యం వహించకూడదని, తమకు కేటాయించిన కాలనీలు, బస్తీల్లో రోజూ తిరుగుతూ.. ఇంటింటికి వెళ్లి చెత్తను తీసుకోవాలన్నారు. ఇళ్ల మధ్యలో చెత్త కుండీలు ఉండటం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురౌతున్నారన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పని చేయని వీధి దీపాలను పూర్తిగా తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. జవాన్ నవీన్, జలమండలి లైన్‌మెన్ పెంటయ్య, ఎలక్ట్రీషియన్ శివ తదితరులున్నారు.

పార్క్ చేసిన వాహనం చోరీ



చోరీకి గురైన ద్విచక్ర వాహనం

అత్తాపూర్: వ్యాపార వాణిజ్య సముదాయ ప్రాంతాల్లో నలు దిక్కుల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత ఆయా యజమానులపై ఉంది. సరైన పర్యవేక్షణ లేక ఓ వ్యక్తి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. తన కుటుంబ అవసరాల నిమిత్తం ఆదివారం సాయంత్రం సమయంలో అత్తాపూర్‌లోని ఓ షాపింగ్ మాల్ కేంద్రానికి వెళ్లి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి తిరిగి వచ్చే సమయానికి తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆ ప్రాంతాన్ని క్రైమ్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని సిబ్బందితో కలిసి సీసీ పుటేజీలను సేకరించారు. రెండ్రోజుల్లోనే వాహనాన్ని తిరిగి సదరు యజమానికి అందజేస్తానని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నిమ్మల వెంకన్న హామీ ఇచ్చినట్టు బాధితుడు తెలిపాడు.

సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలి



మాట్లాడుతున్న డీసీ రవి కుమార్

అత్తాపూర్: ఆస్తిపన్ను బకాయిదారులు సకాలంలో ఆస్తి పన్నును చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రవి కుమార్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన ఆస్తిపన్ను వసూళ్లపై ఏఎంసీ, సూపరింటెండెంట్, టీఎల్స్, బీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిసెంబర్ నెల ఆస్తిపన్ను వసూళ్ల టార్గెట్‌ను అధిగమించాలన్నారు. రూ.5.47 కోట్లు వసూలు చేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రజలందరూ ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి పాటు పడాలని కోరారు.

పొంగుతున్న డ్రైనేజీలు



బస్తీలోని ప్రధాన రోడ్డుపై పొంగుతున్న మురుగు

- సరైన వ్యవస్థ లేకపోవడంతో ప్రజలకు ఇక్కట్లు
- ప్రణాళికాబద్ధంగా పనులు ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు

అత్తాపూర్ : మున్సిపాలిటీ గ్రామ పంచాయతీ నిర్మించిన కచ్చామోరీలతోనే అధికారులు, అనధికారులు కాలం వెల్లదీస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కచ్చామోరీల స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కాలంలో రూ.11 కోట్లతో ప్రధాన రోడ్లలో మాత్రమే డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించారు.

- పెరుగుతున్న జనాభా, అపార్ట్‌మెంట్లు రోజురోజుకు పెరిగిపోతోంది. 300 గజాల స్థలంలో ఒక యజమాని మాత్రమే నివసించే విధంగా ఇల్లు కట్టుకునేవారు.. సుమారు 400 నుంచి 600 గజాల్లో బహుళ అంతస్తుల మేడలు నిర్మాణమవుతున్న సందర్భంలో వందలాదిగా ప్రజలు ఆవాసాల్లో నివసిస్తుంటారు.
- డ్రైనేజీ వ్యవస్థ పాతకాలపు నాటిదే కావడంతో ప్రెషర్‌కు తట్టుకోలేక ఎక్కడికక్కడ పైపులు పగిలిపోతూ.. డ్రైనేజీ నీరంతా రోడ్లపై ప్రవహిస్తుంది. ఈ సమస్యలపై ప్రజలకు ఇబ్బందులు పడకుండా ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్లు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల వేళల్లోనే..

కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే వాగ్దానాలు చేస్తూ.. గట్టెక్కిన నేతలు ప్రజల వద్దకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల తీరులో మార్పులు రావాల్సిన అవసరముందని చెబుతున్నారు. ప్రణాళికబద్ధంగా నూతనంగా యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

అమూల్యమైన ఓటు దుబారా..



కేవలం ఎన్నికల సమయంలోనే మాత్రమే ప్రజల వద్దకు వచ్చే నాయకులను గుడ్డిగా నమ్మొద్దు. హంగు ఆర్భాటాలతో విందు, వినోదాలకు పరిమితం కాకూడదు. మన అమూల్యమైన ఓటు దుబారా అవుతుంది. ఒకరోజు వేటువేసి ఐదేళ్ల పాటు ఇబ్బందుల పాలవుతున్నాం. ప్రజల్లో మార్పు రానంత వరకు సమస్యల సుడిగుండంలోనే మన జీవితాలు, సమస్యలపై పోరాడుతూ పాలకులను నిలదీసే స్థాయికి రావాలి. – రాచూరి రాజశేఖర్

24 గంటలు అందుబాటులో ఉంటాం..



ప్రజల ఆలోచనల మేరకు ఎప్పటికప్పుడు సమీక్షలు చేపడుతూ.. ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ.. అభివృద్ధి కార్యక్రమాలపై నూతన ప్రభుత్వంలో ప్రత్యేకంగా దృష్టి సారించాం. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలి. సమస్య తెలియకుండా అధికారులుగా సంబంధిత నివేదికలను సమర్పించలేం. ప్రజా సమస్యల పరిష్కారానికి 24 గంటలు అందుబాటులో ఉంటాను. – రవి కుమార్, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్